# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 09 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## తగ్గుతున్న బంగారం ధరలు

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

వరుసగా మూడో వారంగా బంగారం ధరలు పడిపోతున్నాయి. అమెరికా డాలర్ విలువలో ఎత్తుపల్లాలు, అక్కడి ఫెడరల్ రిజర్వ్ కొనుగోళ్ల కోసం ఇచ్చిన ప్రోత్సాహక పిలుపు వంటి అంశాలు అంతర్జాతీయ మార్కెట్లలో స్వర్ణం ధరలపై ప్రభావం చూపుతున్నాయి. దేశీయ మల్టీ కమోడిటి ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో డిసెంబర్ డెలివరీ బంగారం ధర గ్రాముకు రూ.165 లేదా 0.14 శాతం తగ్గింది. గత శుక్రవారంనాటి మార్కెట్ ముగింపులో పది గ్రాముల బంగారం ధర రూ.1,21,067గా నమోదైంది. దీపావళి, దంతేరాస్ నేపథ్యంలో అక్టోబర్ నెల చివరినాటికి బంగారం ధరలు భారీగా పెరిగాయి. అక్టోబర్ 17న పది గ్రాముల ధర రూ.1.32 లక్షల గరిష్టాన్ని తాకగా, ప్రస్తుతం దాదాపు రూ.11 వేల మేర తగ్గింది. బంగారం మార్కెట్ ప్రస్తుతం స్తబ్ధత దశలోకి వెళ్లిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికా డాలర్ బలహీనత, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు ప్రభావం చూపుతున్నాయని ఫిక్స్‌డ్ ఇన్కమ్ టాక్స్ అసెట్స్-ఎల్‌జిటి వెల్త్ ఇండియా సీఐఓ చిరాగ్ దోషి వ్యాఖ్యానించారు అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ సుదీర్ఘమై రెండో నెలలోకి చేరడంతో ఆర్థిక రంగంలో అనిశ్చితి పెరిగిందని, దీనివల్ల డాలర్ విలువలో అస్థిరత ఏర్పడిందని విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ మార్పులన్నీ కలసి భారత స్వర్ణ మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు.

# రూ.60,799 కోట్లతో రోడ్ల నిర్మాణం

- హైదరాబాద్-విజయవాడ 8 లేన్ల విస్తరణకు రూ.10 వేల కోట్లు
- రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర చరిత్రలోనే మౌలిక సదుపాయాల కల్పనకు కనీ విని ఎరగని రీతిలో ఒకేసారి రూ. 60,799 వేల కోట్లతో రహదారుల నిర్మాణం చేపడుతున్నట్టు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు. వీటితోపాటు మరో రూ. 28 వేల కోట్లతో చేపట్టనున్న మన్ననూరు నుంచి శ్రీ శ్రీశైలం, ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్ట్ వరకు చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు ప్రతిపాదనలో ఉన్నాయని తెలిపారు. శనివారం ఈ మేరకు మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. మౌలిక సదుపాయాల కల్పనతో బహుళ జాతి సంస్థలకు తెలంగాణ కేంద్రంగా మారనుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు రహదారుల నిర్మాణంతో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోకి పెద్ద సంఖ్యలో పరిశ్రమలు రానున్నాయని పేర్కొన్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు పెరగనున్నాయని అన్నారు. అబ్దుల్లాపూర్ ఇండస్ట్రియల్ పార్కు నుంచి విజయవాడ వరకు ఉన్న హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిని 8 లైన్లుగా విస్తరించనున్నామని పేర్కొన్నారు. ఇందులో ఆరు లైన్లు ప్రధాన రహదారి కాగా, మరో రెండు సర్వీసు రోడ్ల కింద నిర్మాణం జరుగుతుందని తెలిపారు. రహదారి వెంట ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం, రోడ్డు ప్రమాదాలు నివారించడమే లక్ష్యంగా సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 10,400 కోట్లు ఖర్చు చేయనున్నట్టు వివరించారు. తెలంగాణ రాష్ట్ర గతిని మార్చే రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్ ) నిర్మాణానికి రూ. 36,000 వేల కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఆరు లైన్లుగా నిర్మించబోతున్న రీజినల్ రింగ్ రోడ్డు అన్నీ జిల్లాలను కలుపుతుందని వివరించారు. ఈ రహదారి నిర్మాణానికి 50 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. రహదారులు లేని గ్రామీణ ప్రాంతాల్లో కొత్త రోడ్ల నిర్మాణంతోపాటు సింగిల్ రోడ్డు ఉన్నచోట డబుల్ రోడ్ల నిర్మాణం చేయనున్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు రూ. 11,399 కోట్లతో కొద్ది రోజుల్లో టెండర్లు పిలవనున్నామని చెప్పారు. రూ. 8,000 వేల కోట్లతో మన్ననూరు నుంచి శ్రీశైలం 52 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు తుది దశకు చేరాయని చెప్పారు. దేశానికే తలమానికంగా మారనున్న ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేని రూ. 20 వేల కోట్లతో నిర్మించనున్నామని ప్రకటించారు.

# నేటితో ప్రచారానికి తెర

- జూబ్లీహిల్స్‌లో జోరుగు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రచారం
- అమల్లోకి ఆంక్షలు
- అమల్లోకి 144సెక్షన్




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక టాక్ ఆఫ్‌ది స్టేట్‌గా మారింది. ఇక్కడి ఫలితాలు భవిష్యత్ రాజకీయ పరిణామాలకు సంకేతమని ప్రధాన పార్టీలు భావిస్తున్న నేపథ్యంలో ఎన్నికల్లో గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డాయి. ఇక ఆదివారంతో (నేటితో) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారానికి తెరపడనుండడంతో అన్ని పార్టీలు ప్రచారం హోరెత్తిస్తున్నారు. మిగిలిన కొన్ని గంటలనైనా సద్వినియోగించుకోవాలని అన్ని పార్టీల నాయకులు కలిసి గల్లీలు, బస్తీలు, రహదారులను సైతం వదలకుండా ప్రతి ఒక్కరినీ పలకరిస్తున్నారు. దాదాపు నెల రోజులపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వంటి పార్టీలు తమ అభ్యర్థుల గెలుపు కోసం ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ ఆయన భార్య మాగంటి సునీతను బరిలోకి దింపగా, కాంగ్రెస్ నుంచి వీ. నవీన్ యాదవ్, బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి పోటీలోకి దిగారు. అధికారపార్టీ కాంగ్రెస్, ప్రతిపక్షపార్టీ బీఆర్ఎస్‌తోపాటు బీజేపీ తమ అభ్యర్థి గెలుపు కోసం అన్ని విధాలా కసరత్తు చేస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, మేయర్, కార్పొరేషన్ చైర్మన్‌లతోపాటు క్షేత్రస్థాయి కారకర్తలు పనిచేస్తుండగా, బీఆర్ఎస్ నుంచి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ వంటి ప్రముఖులు ప్రచారం నిర్వహిస్తున్నారు. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలన్న కాంక్షతో ప్రభుత్వంపై, కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై బీఆర్ఎస్ విమర్శల వర్షం కురిపిస్తోంది. అభివృద్ధి, సంక్షేమంతోపాటు మాగంటి చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఇక ఎలాగైనా విజయం సాధించాలన్న కసితోవున్న అధికార కాంగ్రెస్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో జరిగిన మొదటి ఉప ఎన్నిక కంటోన్మెంట్ సిట్టింగ్ సీటును తమ ఖాతాలో జమచేసుకున్నట్టే, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సైతం, సత్తాచాటి రాష్ట్రవ్యాప్తంగా ఓ మెసేజ్ పంపాలని తమదైన శైలీలో ముఖ్యమంత్రితోపాటు మంత్రులు ప్రచారం నిర్వహిస్తున్నారు.

జూబ్లీహిల్స్ పరిధిలో మొత్తం 3,92,669 మంది ఓటర్లు ఉన్నారు. 139 లోకేషన్స్‌లో, 407 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. 38మంది సెక్టార్ అధికారులతోపాటు 2400 మంది పోలీస్ సిబ్బందితోపాటు ఇతర శాఖలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అక్టోబర్ 13న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. కోట్ల విజయబాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో 21తేదీవరకు నామినేషన్లు స్వీకరించారు. 22న

మిగితా 4వ పేజీలో



## డిసెంబర్ 1 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పార్లమెంట్ శీతాకాల సమావేశాల తేదీలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. డిసెంబర్ 1 నుంచి 19 వరకు సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు శనివారం వెల్లడించారు. మూడు వారాల పాటు కొనసాగే ఈ సెషన్‌లో మొత్తం 15 సిట్టింగ్‌లు ఉండనున్నాయి. 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జరుగుతున్న పార్ట్-SIR (ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ) పై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ సమావేశాలు రసవత్తరంగా మారే అవకాశం ఉంది.

సమావేశాల తేదీల ప్రకటన మీద వెంటనే కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. 15 రోజుల్లో పార్లమెంట్ నిర్వహించడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. చర్చించడానికి బిల్లులు లేవని, చర్చలు జరగనీయడానికి ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. టీఎంసీ నేత డెరెక్ ఒబ్రియాన్ కూడా కేంద్రాన్ని ఎద్దేవా చేస్తూ "ప్రభుత్వం పార్లమెంట్ ఫోబియాతో బాధపడుతోంది" అని వ్యాఖ్యానించారు.

# మా దేశంలో పెట్టుబడులు పెట్టండి

- సింగరేణికి ఘనా దేశం ఆహ్వానం
- సంస్థ విస్తరణలో శుభపరిణామం
- సీఎండీ బలరామ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తమ దేశంలో పెట్టుబడులు పెట్టాలని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెట్ (ఎస్‌సీసీఎల్) ను ఘనా దేశం ఆహ్వానించింది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శనివారం ఆ దేశ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సంస్థ సీఎండీ ఎన్.బలరామ్‌తో సమావేశమై పలు వ్యాపార అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ దేశంలో ఖనిజ రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయనీ, ఈ విషయంలో విశేష అనుభవం గల సింగరేణి సంస్థకు తాము స్వాగతం పలుకుతున్నామని చెప్పారు. వజ్రాలు, బంగారం, బాక్సైట్, మాంగనీస్, లిథియం వంటి పలు ఖనిజాలను మైనింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. అయితే ఈ రంగంలో మరింత ఉత్పత్తి పెంచడానికి అవసరమైన పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. తమ దేశంలో బొగ్గు మైనింగ్ కూడా ఉందనీ, అందులోనూ సింగరేణి సహకారాన్ని కోరుతున్నట్టు చెప్పారు. సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా విదేశాల్లో కీలక ఖనిజ రంగాల్లో కూడా ప్రవేశించాలని ఇప్పటికే నిర్ణయించిందని సీఎండీ బలరామ్ తెలిపారు. ఘనా దేశంలో కూడా మైనింగ్ జరపటానికి గల అవకాశాలను పరిశీలిస్తామన్నారు. కీలక ఖనిజాల తవ్వకాలకు అవకాశం ఉంటే అధిక ప్రాధాన్యత ఇస్తామని వారికి హామీ ఇచ్చారు. మరో నెల రోజుల్లో ఘనా దేశానికి చెందిన సాంకేతిక నిపుణులు కేంద్ర ప్రభుత్వంతో సమావేశం కానున్నారని ఆ దేశ ప్రతినిధి బృందం పేర్కొంది. ఆ సమయంలో మరో దఫా సమావేశం కావడంతో పాటు తమ దేశానికి సింగరేణి ప్రతినిధి బృందాన్ని పంపించాల్సిందిగా వారు సీఎండీని కోరారు. అధికారుల బృందాన్ని ఘనా దేశానికి పంపిస్తామని సీఎండీ బలరామ్ ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. సంస్థ విస్తరణలో ఇది శుభపరిణామని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో డైరెక్టర్ (పీఅండ్‌పీ) కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్) గౌతమ్ పొట్రు, జీఎం(కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, ఘనా దేశ ప్రతినిధి బృందంలో బిజినెస్ కన్సల్టెంట్ అబ్దుల్ సలాం మోర్గాన్ అగ్బోటు, ఘనా దేశం తరపున మాలి దేశ రాయబారి అహ్మద్ ఉమర్ సాండా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఓడిపోతామనే భయంతోనే అబద్ధాలు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పరిపాలన చాతగాకుంటే గద్దె దిగిపోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సీఎం మానసిక స్థితిపై అనుమానాలున్నాయని చెప్పారు. జూబ్లీ హిల్స్‌లో ఓడిపోతామనే భయంతోనే అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. పదేండ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి జూబ్లీహిల్స్ ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటేసి మాగంటి సునీతను గెలిపించాలని పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రెండేండ్లలో రేవంత్‌రెడ్డి పాలనలో చేసిందేమీ లేక గత కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలంటున్నారని అన్నారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలన చూసి ఓటేయమని అడిగే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదన్నారు. ఆయన అప్పుడు కాంగ్రెస్‌లో లేరని గుర్తు చేశారు. జలయజ్ఞాన్ని ధనయజ్ఞం అన్నారని చెప్పారు. క్విడ్ ప్రోకో చేసి రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడ్డారంటూ వైఎస్‌పై ఆరోపణలు చేశారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఆరు గంటల కరెంటు కూడా సక్రమంగా వచ్చేది కాదంటూ రేవంత్‌రెడ్డి అన్నారని గుర్తు చేశారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తప్పు అని ఒప్పుకోవాలనీ, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే జూబ్లీహిల్స్ ప్రజలను ఓట్లడగాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3,600 కోట్లే ఉన్నాయనడం సరైంది కాదన్నారు. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా?అని సవాల్ విసిరారు. రూ.ఎనిమిది వేల కోట్లకుపైగా ఫీజు బకాయిలున్నాయని డిమాండ్ చేశారు. బీహార్ ఎన్నికలకు ముందు బడా కాంట్రాక్టర్లకు ఇచ్చిన బిల్లులపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. పిల్లల చదువులు ముఖ్యమా?, కమీషన్లు ముఖ్యమా?అని అడిగారు. మందిని తొక్కడం, మాట తప్పడం రేవంత్‌రెడ్డి నైజమని అన్నారు. వికృత చేష్టలు, విచిత్ర విన్యాసాలు తప్ప ప్రజలకు పనికొచ్చే ఒక్క పని కూడా చేయలేదన్నారు. దొంగే దొంగ అన్నట్టుందిగా రేవంత్ రెడ్డి తీరు ఉందని చెప్పారు. కిషన్‌రెడ్డి, రేవంత్ రెడ్డిదే ఫెవికాల్ బంధమని అన్నారు. ఆయనపై ఓటుకు నోటు కేసులో ఈడీ కేసు ఉందనీ, ఎందుకు విచారణ జరగడం లేదని ప్రశ్నించారు. పొంగులేటి ఇంటిపై ఈడీ దాడి చేస్తే ఎందుకు విచారణ జరగడం లేదన్నారు. బీహార్ ఎన్నికలకు డబ్బులు పంపుతున్నారంటూ ఢిల్లీలో భట్టి విక్రమార్క ఇంట్లో ఐటీ దాడులు జరిగాయని అన్నారు. బడేబాయ్‌తో చోటేబాయ్‌కి బలమైన బంధం ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో పెట్టుబడుల కోసం బహుళజాతి సంస్థలు (ఎంఎన్‌సీ) వరుసలో నిలబడితే ఇప్పుడు యూరియా కోసం రైతులు వరుసలో నిలబడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈనెల 11న జూబ్లీహిల్స్ ఓటర్లు వరుసలో నిలబడి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఇప్పటికే నిర్ణయించుకున్నారని అన్నారు. రెండేండ్లలో చేసిన అభివృద్ధి, ఆరు గ్యారంటీల అమలు గురించి చెప్పి కాంగ్రెస్ ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, నగేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


# ఎగిరి పడేవారి తోక కట్ చేస్తా

- 14 తర్వాత తెలంగాణలో కొత్త తుపాను
- ఎర్రగడ్డ డివిజన్ రోడ్డు షోలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఈ నెల 14వ తేదీ తర్వాత తెలంగాణలో కొత్త తుఫాను రాబోతోందనీ, కొంతమంది ఆకు రౌడీలు, గుండాలు.. పోలీసులు ఎక్కువ చేస్తున్నారనీ, 500 రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రాబోతుందనీ, ఒక్కొకరి పేరు రాసి పెట్టుకుని ఎవడెవడు ఎగిరి పడుతున్నాడో వాడి తోక కట్ చేస్తా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి తాత దిగొచ్చినా మిమ్మల్ని కాపాడలేడన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని ఎర్రగడ్డ డివిజన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ రోడ్డు షోలో కేటీఆర్ మాట్లాడారు. భయపడకండి.. కొంత మంది ఆకు రౌడీలు, గుండాగాళ్లు ఓటేయకపోతే ఏమో చేస్తామని బెరిస్తున్నారన్నారు. నేడు అధికారం ఉందని ఎగిరెగిరి పడుతున్నారనీ, 14వ దిమ్మ తిరుగుతదన్నారు. మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తేనే ఆరు గ్యారెంటీలు అమలవుతాయన్నారు. కాంగ్రెస్ ఓడిపోతున్నట్టు సర్వేలో డౌన్ కాగానే అజారుద్దీన్‌ను మంత్రిని చేశారనీ, సినిమా వాళ్ల వద్దకు పోయారనీ, సీఎం, మంత్రులు గల్లీగల్లీలు తిరుగుతున్నారన్నారు. ఓటమి భయంతో ఇన్ని పనులు చేసినోడు ఓడగొడితే సచ్చుకుంటూ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాడు కదా..? అన్నారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడగొడితేనే తులం బంగారం, పెన్షన్లు వస్తాయన్నారు. ఒక వేళ కాంగ్రెస్‌కు ఓటేస్తే మోసం చేసినా అమాయక ప్రజలు మళ్లీ తనకే ఓటేస్తున్నారని పథకాలను రేవంత్ రెడ్డి అమలు చేయరన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు కారు గుర్తుకు ఓటేసి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



## డీఎన్ఏ డబుల్ హీలిక్స్ ఆవిష్కర్త జేమ్స్ వాట్సన్ కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రఖ్యాత శాస్త్రవేత్త, డీఎన్ఏలో డబుల్ హీలిక్స్ నిర్మాణాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన జేమ్స్ వాట్సన్ (97) గురువారం నార్త్‌పోర్ట్‌లో కన్నుమూశారు. ఆయన కుమారుడు డంకన్ వాట్రస్ ఈ విషయాన్ని ధృవీకరించారు. డీఎన్ఏ నిర్మాణ ఆవిష్కరణకు గాను వాట్సన్, ఫ్రాన్సిస్ క్రిక్, మారిస్ విల్కిన్స్‌లు కలిసి 1962లో నోబెల్ బహుమతి అందుకున్నారు.

1928 ఏప్రిల్ 6న చికాగోలో జన్మించిన వాట్సన్, కేవలం 19 ఏళ్లకే చికాగో విశ్వవిద్యాలయం నుండి జువాలజీ పట్టా పొందారు. అనంతరం ఇండియానా విశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డీ పూర్తి చేశారు. 1953లో ఆయన సూచించిన డబుల్ హీలిక్స్ నమూనా, వారసత్వ సమాచారాన్ని తరాలకి ఎలా బదిలీ అవుతుందో శాస్త్ర ప్రపంచానికి వివరిసి, జన్యుశాస్త్రంలో విప్లవాత్మక మార్పులకు దారితీసింది. 2014లో ఆర్థిక ఇబ్బందుల వల్ల వాట్సన్ తన నోబెల్ బహుమతిని వేలం వేయగా, ఒక రష్యా బిలియనీర్ 4.8 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసి వాట్సన్‌కు తిరిగి సాయంగా ఇచ్చాడు.


## బేగంపేటలో విద్యార్థుల గంజాయి పార్టీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లో హెటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల గంజాయి పార్టీ కలకలం రేపింది. బేగంపేటలోని కులినరి అకాడమీ ఆఫ్ ఇండియాలో విద్యార్థులు మత్తుపదార్థాలు వాడుతున్నారన్న సమాచారం మేరకు నార్కోటిక్ పోలీస్ స్టేషన్ ప్రత్యేక ఈగల్ బృందం దాడులు నిర్వహించింది. ఈ నేపథ్యంలో కాలేజీలో ఏర్పాటు చేసిన పార్టీలో గంజాయి వినియోగం జరుగుతోందని నిర్ధారించిన పోలీసులు 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని తల్లిదండ్రుల సమక్షంలో టిహెచ్‌సి పరీక్షలకు నిర్వహించగా ఆరుగురు విద్యార్థులకు పాజిటివ్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. పాజిటివ్ వచ్చిన విద్యార్థులుగా సాక్షి ఈమాలియా, మోహిత్ షాహి, శుభం రావత్, కరోలినా సైన్‌తియా హారిసన్, ఆరిక్ జోనథన్ ఆంటోనీ, లాయ్ బారౌహా గుర్తించారు. వీరిని రీహ్యాబిలిటేషన్ సెంటర్‌కు తరలించారు. మోహిత్ గతంలో ఉడిపిలోని మణిపాల్ విశ్వవిద్యాలయంలో చదువుతున్నప్పుడు కూడా డ్రగ్స్ వాడినట్టు విచారణలో తేలింది. అతడి తండ్రి అక్కడి నుంచి తీసుకువచ్చి ఇక్కడ చేర్పించినప్పటికీ అతని వ్యసనం కొనసాగిందని పోలీసులు తెలిపారు.

## బిహార్‌లో తుపాకుల పాలన అవసరం లేదు

- ప్రధాని మోదీ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బిహార్‌కు అవినీతి, తుపాకుల ప్రభుత్వం అవసరం లేదని, రాష్ట్ర ప్రజలు అలాంటి పాలనను తిరస్కరిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మండిపడ్డారు. శనివారం సీతామర్హిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ మహాగఠ్‌బంధన్ నేతలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తమ ప్రచారం ప్రతిపక్షాలకు నిద్రలేని రాత్రులు ఇస్తోందని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఫుట్‌బాల్‌లు, హాకిస్టిక్‌లు అందజేస్తున్నామని, కానీ ఆర్జేడీ మాత్రం యువతకు రివాల్వర్లు, డబుల్‌బ్యారెల్ గన్స్ గురించి మాట్లాడుతోందని మోదీ అన్నారు. పిల్లలను గ్యాంగ్‌స్టర్లుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. "మేము పిల్లల చేతుల్లో పుస్తకాలు, కంప్యూటర్లు ఇస్తున్నాం ఆర్జేడీ మాత్రం రివాల్వర్లు ఇచ్చే భవిష్యత్తును చూపుతోంది." అన్నారు. ఆర్జేడీ, కాంగ్రెస్ పాలనలో కేంద్రం ఇచ్చిన ఒక రూపాయిలో ప్రజలకు కేవలం 15 పైసలే చేరేవని ఆరోపించారు. దోపిడీకి కారణమెవరో ప్రజలందరికీ తెలుసని అన్నారు. ఆర్జేడీ ప్రచార వేదికలపై అమాయక పిల్లలను బలవంతంగా గ్యాంగ్‌స్టర్లా మాట్లాడిస్తున్నారని, వారి 'జంగిల్ రాజ్' పాత నినాదాలు వింటే ప్రజలు షాక్ అవుతారని మోదీ విమర్శించారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌లకు పరిశ్రమలపై మౌలిక అవగాహన కూడా లేదని, పరిశ్రమలు ఎలా మూసేయాలో మాత్రమే తెలుసని ప్రధాని ఎద్దేవా చేశారు. 'జంగిల్‌రాజ్'గా పేరుపొందిన 15 ఏళ్ల పాలనలో ఒక్క పెద్ద ఆస్పత్రి కానీ, వైద్య కళాశాల కానీ బిహార్‌లో నెలకొల్పలేదని విమర్శించారు.

# ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక వేడెక్కుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఘాటు ప్రతిస్పందన ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో రేవంత్ రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కిషన్‌రెడ్డి, ఎన్నికల హామీల అమలుపై సీఎం మౌనం ఎందుకు పాటిస్తున్నారో ప్రశ్నించారు. నాపై చేసిన ఆరోపణలను రేవంత్ నిరూపించాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత విమర్శలతో తాను భయపడబోనని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఏం చేశారో సీఎం చెప్పాలని కోరారు. రేవంత్ వ్యాఖ్యలను తెలంగాణ ప్రజలు విశ్వసించడం లేదని, కాంగ్రెస్ ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని ఆరోపించారు.

ఆరు గ్యారెంటీల విషయమై కాంగ్రెస్ మాట్లాడటానికి ఎందుకు తప్పుకుంటోందని కేంద్రమంత్రి ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓటమి ఖాయమని పేర్కొన్నారు. వాస్తవాలకు విరుద్ధంగా సీఎం వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. తనను విమర్శించే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదని ఢీకొట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను అవినీతి, కుటుంబ రాజ్యాలుగా అభివర్ణిస్తూ, బీజేపీ మాత్రం కుటుంబ పార్టీ కాదని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో ఫేక్ వీడియోలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ గెలిచాయని ఆరోపించారు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కూడా అదే పద్ధతులు ఉపయోగిస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు.

కేసీఆర్ కుటుంబం నుంచి లక్షకోట్లు కక్కిస్తామని కాంగ్రెస్ నేతలు పూర్వంలో ప్రచారం చేసినా, నేటికి ఒక్క రూపాయి కూడా బయటపడలేదని విమర్శించారు. ఢిల్లీలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య ఒప్పందం కుదిరిందన్నది నిజమే కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలపై ఎన్నో అవినీతి ఆరోపణలు చేసినా, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కేసు కూడా నమోదు చేయలేదని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్, విద్యుత్, ధాన్యం కొనుగోళ్లపై పెద్దఎత్తున విమర్శలు చేస్తూ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. హైదరాబాద్ అభివృద్ధిపై తాను చేసిన పనులను వివరించడానికి సిద్ధంగా ఉన్నానని, సీఎం రేవంత్ చర్చకు సమయం ఇస్తే ఎప్పుడైనా మాట్లాడగలనని చెప్పారు. కేసీఆర్‌ను కాపాడేది రాహుల్ గాంధీ కాదా అని ప్రశ్నిస్తూ, అలా కాకపోతే కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు.

మిగితా 4వ పేజీలో

# జూబ్లీహిల్స్‌లో బీజేపీ విజయం ఖాయం

- బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు చూపిస్తున్న అపారమైన స్పందనను చూస్తుంటే ఈ ఉపఎన్నికల్లో బీజేపీ విజయం అనివార్యమని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వెంగళరావు నగర్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనూ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనూ హైదరాబాద్ అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రజలు ఈసారి కాంగ్రెస్%-%బీఆర్ఎస్‌ల మోసపూరిత పాలనకు ముగింపు పలకబోతున్నారని పేర్కొన్నారు. సభకు భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి రంఛందర్‌రావు "ఈ తరహా ఆదరణ చూస్తుంటే నవంబర్ 11న జరగబోయే ఉపఎన్నికల్లో బీజేపీ విజయం స్పష్టంగా కనిపిస్తోంది" అని అన్నారు. ఇప్పటికే జనసేన పార్టీ బీజేపీకి మద్దతు ప్రకటించడంతో కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వచ్చిందని తెలిపారు.

బస్తీలు, కాలనీల్లో పరిస్థితి దారుణంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. మురుగునీటి సమస్యలు, తెరచి ఉన్న మ్యాన్‌హోల్‌ల వల్ల ప్రాణనష్టాలు, చిన్న వానకే నదుల్లా మారే రోడ్లుఈ పరిస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమనారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా, తులం బంగారం, స్కూటీలు, మహిళలకు రూ.2500, ఇందిరమ్మ ఇండ్లు, ఇంటర్నేషనల్ స్కూల్స్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీ కూడా నెరవేరలేదని విమర్శించారు. హైదరాబాద్‌ను విశ్వనగరం చేస్తామని చెప్పి, వాస్తవానికి విషాదనగరంగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో కనిపిస్తున్న అభివృద్ధి అన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాధ్యమైందని తెలిపారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి బీజేపీ ద్వారానే సాధ్యమని, ఈ ఉపఎన్నికల్లో పార్టీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని ఘన విజయం సాధించేందుకు ఓటర్లు సహకరించాలని రంఛందర్‌రావు పిలుపునిచ్చారు.

## ఉప్పల్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య..



**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ పరిధిలోని ఉప్పల్, మల్లికార్జున నగర్ ప్రాంతంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ (42) ఆత్మహత్య చేసుకున్నారు. 2009 బ్యాచ్‌కు చెందిన శ్రీకాంత్ గత కొంతకాలంగా మల్లికార్జున నగర్‌లో నివాసం ఉంటున్నారు. అక్టోబర్ 23వ తేదీ నుండి ఆయన విధులకు హాజరు కాలేదు. ఈ క్రమంలోనే, శనివారం శ్రీకాంత్ తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కానిస్టేబుల్ శ్రీకాంత్ మరణంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.



## సీఎం రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రులు, ప్రజాప్రతినిధులు..

**బలగం టీవీ, హైదరాబాద్**



పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి యాదగిరిగుట్ట ఆలయ అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనం అందించారు. అలాగే శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి ని కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పుట్టిన రోజును పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలియజేసిన ప్రముఖులందరికీ రేవంత్ రెడ్డి పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

## అటవీ అధికారులతో కలిసి పవన్ కళ్యాణ్ పర్యటన..

- **ఏపీ తిరుపతి జిల్లా మామండూరు అటవీ ప్రాంతాన్ని పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్**

**బలగం టీవీ, తిరుపతి**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ శనివారం తిరుపతి జిల్లాలోని మామండూరు అటవీ ప్రాంతాన్ని విస్తృతంగా పరిశీలించారు. అరుదైన శేషాచలం అడవి సంపదను, అక్రమ రవాణా నిరోధక చర్యలను తెలుసుకోవడానికి మంత్రి సుదీర్ఘంగా పర్యటించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ అడవిలో నాలుగు కిలోమీటర్ల పైగా ప్రయాణించి, అందులో రెండు కిలోమీటర్ల మేర కాలినడకన ప్రతి చెట్టునీ దగ్గరగా పరిశీలించారు. ఈ పర్యటనలో ఆయన ఎర్రచందనం, అంకుడు, తెల్లమద్ది, వెదురు వంటి ముఖ్యమైన వృక్షాలతో పాటు, శేషాచలంలో మాత్రమే కనబడే అరుదైన మొక్కలను ఆసక్తిగా గమనించి, అటవీ అధికారుల నుంచి వాటి వివరాలు తెలుసుకున్నారు.

నేపిరయర్ రిజర్వ్ ఫారెస్ట్ వద్ద ఉన్న వాచ్ టవర్ నుంచి మంత్రి మొత్తం అటవీ ప్రాంతాన్ని, దాని విస్తృతిని పరిశీలించారు. వెలిగొండ, శేషాచలం అటవీ సరిహద్దుల గురించి, ముఖ్యంగా స్వర్ణముఖీ నది ఎక్కడి నుంచి ఉద్భవిస్తుంది వంటి భౌగోళిక వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుంటి మడుగు వాగు ఒడ్డున కూర్చుని, చుట్టుపక్కల పరిసరాలను నిశితంగా తిలకించారు. వాగుకు ఇరువైపులా ఉన్న చెట్ల వివరాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. స్మగ్లింగ్ నిరోధక చర్యలపై ఆరా: అటవీ శాఖ మంత్రిగా, ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టడంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఎర్రచందనం స్మగ్లింగ్ తీరు, స్మగ్లింగ్ నిరోధక ఆపరేషన్స్, టాస్క్ ఫోర్స్ కార్యకలాపాలు, అటవీ సిబ్బంది నిర్వహిస్తున్న కూంబింగ్ వంటి కీలక అంశాలపై అధికారుల నుంచి పూర్తి వివరాలు తెలుసుకున్నారు.

## ఈసీని గుప్పిట్లో పెట్టుకుని ఓట్ల అవకతవకలకు పాల్పడుతున్న బీజేపీ

- **టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**



**బలగం టీవీ, హైదరాబాద్**

ఈసీని గుప్పిట్లో పెట్టుకుని ఓట్ల అవకతవకలకు బీజేపీ పాల్పడుతోందని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గాంధీ భవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఎన్నికల సంఘంపై బీజేపీ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని తీవ్ర విమర్శలు గుప్పించారు.

మహేష్ గౌడ్ మాట్లాడుతూ, "ఓట్ల అవకతవకలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పటికే ఆధారాలు సమర్పించారు. హరియాణాలో ప్రజలు కాంగ్రెస్ గెలుస్తుందని భావించినా, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా బీజేపీ విజయం సాధించింది. అక్కడ 25 లక్షల నకిలీ ఓట్లు ఉండడం దానికే నిదర్శనం. ఒకే మహిళ ఫోటోతో వందకు పైగా ఓట్లు నమోదయ్యాయి. పక్క రాష్ట్రాల వ్యక్తులను కూడా హరియాణా ఓటర్లగా చేర్చారు" అని ఆరోపించారు.

బీహార్‌లో తమ బలం లేని ప్రాంతాల్లో బీజేపీ ఓట్ల తొలగింపులకు పాల్పడుతున్నదని తెలిపారు. "రాహుల్ గాంధీ ఆధారాలతో ప్రశ్నించినా ఇసీ వద్ద సమాధానం లేదు. నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన ఎన్నికల సంఘం ఒకే పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తోంది" అని విమర్శించారు.

ఓట్ల అవకతవకలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సంతకాల సేకరణ కొనసాగుతోందని వెల్లడించారు. ఇప్పటి వరకు 5 కోట్లకు పైగా సంతకాలు సేకరించామని తెలిపారు. "జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కూడా పక్క నియోజకవర్గాల ఓటర్లను చేర్చారు. బీజేపీ–బీఆర్ఎస్ మధ్య లోపాకారి ఒప్పందం ఉన్నందువల్లే ఈ ఎత్తుగడలు సాగుతున్నాయి" అని ఆరోపించారు. సేకరించిన సంతకాల పత్రాలను ట్రక్కుల ద్వారా రాష్ట్రపతికి పంపనున్నట్లు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలనే ఉద్యమం

- **ఎంపీ ఆర్.కృష్ణయ్య**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఫీజుల రీయింబర్స్‌మెంట్‌పై కొనసాగుతున్న బీసీ విద్యార్థుల ఉద్యమం కాలేజీ యాజమాన్యాల కోసం కాదని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలనే ఆకాంక్షతోనే జరుగుతోందని ఎంపీ ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన వివరణ ఇచ్చారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు.

"బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం 50 ఏళ్లుగా పోరాటం కొనసాగుతూనే ఉంది. 2004%–%2008 మధ్య ఫీజుల రీయింబర్స్‌మెంట్ స్కీమ్ కోసం అనేక ఉద్యమాలు చేశాను. చివరికి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టగా అప్పటి ముఖ్యమంత్రి డా.రాజశేఖర్ రెడ్డి స్పందించి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశారు. చర్చల అనంతరం యాజమాన్య భారం లేకుండా లక్షలాది విద్యార్థులు చదివేలా ఈ పథకం అమల్లోకి వచ్చింది. జీవో నెం.8, 50లు జారీ చేసినప్పుడు కూడా నా పేరును రిఫరెన్స్‌గా పేర్కొన్నారు" అని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వ పనితీరుతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన విమర్శించారు. ఫీజుల బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకువచ్చి ఫీజులు కట్టకపోతే సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని చెప్పారు.

ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం అప్పులు చేస్తున్నారని, సర్టిఫికెట్లు అందక కొందరు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆయన తెలిపారు. పీజీ కోర్సుల్లో సీట్లు పొందిన విద్యార్థులు కూడా సర్టిఫికెట్లు లేనందున చేరలేకపోతున్నారని పేర్కొన్నారు. విదేశీ విద్య, విదేశీ ఉద్యోగాలు పొందిన వారు కూడా ఫీజుల బకాయిల కారణంగా సర్టిఫికెట్లు పొందలేక అవకాశాలు కోల్పోతున్నారన్నారు."విద్యార్థుల కోసం చేస్తున్న సమరాన్ని యాజమాన్యాల ఉద్యమంగా చిత్రీకరించడం తగదు. విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటున్నందుకే ఉద్యమం చేస్తున్నాం" అని ఎంపీ కృష్ణయ్య స్పష్టం చేశారు.

## 'రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డిలది బలమైన బంధం'

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రామ్‌కో సిమెంట్ కంటే బలమైన బంధం ఈ ఇద్దరి నేతల మధ్య ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో శనివారం మీడియాతో మాట్లాడిన సుమన్, రేవంత్%–%కిషన్‌ల రాజకీయ అనుబంధంపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు.

సుమన్ మాట్లాడుతూ, "కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి పెద్దమ్మ%–%చిన్నమ్మల కొడుకుల్లా ఉంటారు. బీజేపీ సీఎంకు దొరక్కపోయే అపాయింట్‌మెంట్ రేవంత్‌కు వెంటనే దొరుకుతుంది. రేవంత్ టీడీపీలో ఉన్నప్పటి నుంచే బీజేపీ ఎంపీలతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు మొత్తం రేవంత్‌కే పని చేస్తున్నట్లు కనిపిస్తున్నారు. బండి సంజయ్ కూడా రేవంత్‌కు సహాయ మంత్రిలా వ్యవహరిస్తున్నారు. బీజేపీ ఎంపీలు 'మెంబర్స్ ఆఫ్ రేవంత్ రెడ్డి'గా మారిపోయారు" అని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంపై స్పందించిన సుమన్, "సీఎం గల్లీగల్లీ తిరుగుతున్న తీరు చూస్తేనే ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నడూ లేనివిధంగా తొమ్మిది రోజులు ఒకే నియోజకవర్గంలో ప్రచారం చేయడం ప్రజల్లో భయభ్రాంతులు సృష్టించే ప్రయత్నమే" అన్నారు. తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నివాసాలపై పోలీసులు నిర్వహించిన సోదాలపై మండిపడ్డ సుమన్, "జూబ్లీహిల్స్ పరిధిలోకి రాని ఇళ్లపై రైడ్లు చేయడం విచిత్రం. సమాచారం ఆధారంగా చేశామంటున్నారు. అయితే కంప్లైంట్ ఇచ్చిన వారిని విచారించారా?" అని ప్రశ్నించారు. "ఎర్రగడ్డలో కాంగ్రెస్ నేత ఇంట్లో కూడా డ్రామా సోదాలు చేశారు" అని ఆరోపించారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్%–%బీజేపీలు ఒకటయ్యాయని సుమన్ ఆరోపించారు. "బండి సంజయ్ వచ్చి రెచ్చగొట్టి కాంగ్రెస్‌కు అండగా నిలుస్తున్నారు. కాంగ్రెస్ నేతలు కుక్కర్లు పంచుతూ, గూగుల్ పే–ఫోన్ పే ద్వారా డబ్బులు ఇస్తామని చెప్పి ఓటర్లను ప్రలోభపెడుతున్నారు. ఎన్నికల కమిషన్, అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు" అన్నారు. ఎన్నికల రోజు బైండోవర్ చేసిన 140 మందిని బయటకు రానివ్వవద్దని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు తెలిపారు. పోలీసుల ప్రవర్తనపై సుమన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పోలీసులు రేవంత్‌రెడ్డి ప్రైవేట్ సైన్యంలా పనిచేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను బెదిరిస్తున్నారు. ఏపీలో జరిగేది చూసి పాఠాలు నేర్చుకోవాలి. పోలీసులు కాంగ్రెస్ ఏజెంట్లలా పనిచేయకూడదు" అని హెచ్చరించారు.

## మామపై పెట్రోలు పోసి నిప్పంటించిన అల్లుడు

**బలగం టీవీ, హైదరాబాద్**

వికారాబాద్ జిల్లాలోని యాలాల మండలంలో శుక్రవారం చోటుచేసుకున్న దారుణం ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆస్తి కోసం అల్లుడు తన మామపై పెట్రోలు పోసి నిప్పంటించగా, ఈ ఘటనలో కుమార్తె కూడా భర్తకు సహకరించడం కలకలం రేపింది. బాధితుడు కమ్మరి కృష్ణ, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెన్నూరు గ్రామానికి చెందిన కృష్ణ కమ్మరి వృత్తితో జీవనం సాగిస్తూ రెండు ఎకరాల భూమిని సంపాదించుకుని, గ్రామంలో ఇల్లు కట్టుకున్నాడు. అతని కుమార్తె అనితను కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా చిత్తాపూర్‌కు చెందిన అర్జున్ పవార్‌తో వివాహం చేశారు. ఇంతలో మామ కృష్ణ ఆస్తిపై కన్నేసిన అర్జున్ కొంతకాలంగా ఆస్తిని తన పేరుమీద రాయాలని ఒత్తిడి తెస్తూ తరచూ గొడవపడుతున్నాడు. గురువారం ఇదే విషయంపై మళ్లీ వాగ్వాదం చెలరేగడంతో అర్జున్ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. వెంటనే కృష్ణపై పెట్రోలు కుమ్మరించి నిప్పంటించాడు. అక్కడే ఉన్న అనిత భర్తకు సహకరించడం గమనార్హం. నిప్పంటించడంతో కృష్ణ అగ్నికి ఆహుతి కావడం ప్రారంభించగా, అతని కేకలు విన్న స్థానికులు పరుగున వచ్చి మంటలను ఆర్పి రక్షించారు. అనంతరం అతన్ని తాండూర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఘటనపై కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అర్జున్ పవార్, అనితలపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

## దుండిగల్‌లో మహిళ దారుణ హత్య"

**బలగం టీవీ, హైదరాబాద్**

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళను గొంతు కోసి అతి కిరాతకంగా హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. దుండిగల్ సిఐ పి. సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా తిమ్మాపూర్‌కు చెందిన స్వాతి (30) 2015లో వివాహం చేసుకుంది. గత పది సంవత్సరాలుగా భర్తతో దూరంగా ఉంటూ, బహదూరపల్లి గ్రీన్ హిల్స్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉండేది. ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న స్వాతి గత కొంతకాలంగా ఒక వ్యక్తితో సన్నిహితంగా ఉన్నట్లు ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు. గత 10 రోజులుగా ఆ వ్యక్తితో వివాదాలు కొనసాగుతున్నట్టు దర్యాప్తులో తేలింది. ఈ కోణంలోనే కేసును పరిశీలిస్తున్నామని సీఐ తెలిపారు.ఘటనా స్థలానికి సమీపంలో ఉన్న సీసీ కెమెరాల్లో ఇద్దరు వ్యక్తులు వచ్చి వెళ్తున్న దృశ్యాలు రికార్డయ్యాయని పోలీసులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో హత్యలో పాల్గొన్నట్లు బోయ రాజేష్ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని దుండిగల్ పోలీసులు తెలిపారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు ఆధారంగా హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు సీఎం కృషి




బలగం టీవీ, జగిత్యాల

క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి గొప్ప పేరు తెచ్చే విధంగా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని గీతా విద్యాలయం మైదానంలో శనివారం తెలంగాణ మహిళల ఇంటర్ డిస్టిక్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, ఫైన్ ఆర్ట్స్ ముఖ్యమన్నారు. క్రీడలు ప్రోత్సహించడం ద్వారానే అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీ తీసుకురావడం వల్ల విద్య, ఉద్యోగాల్లో 2 శాతం రిజర్వేషన్ కల్పనతో క్రీడలకు ప్రోత్సాహం కలుగుతుందని అన్నారు. తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని వెల్లడించారు. జగిత్యాల నియోజకవర్గంలో క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు.ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి చేశారు. క్రీడాకారులకు పండ్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి శోభన్ బాబు, జగిత్యాల సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సభ్యులు సుధాకర్ , డీవైఎస్‌వో రవి బాబు, రాజ్ కుమార్ , పురుషోత్తం, అశోక్ రావు , శరత్ రావు, వేణు గోపాల్ మోహన్ వెంకటేష్ యం ఏ ఆరిఫ్ కొలగని సత్యం, తిరుమలయ్య, దుమాల రాజ్ కుమార్ , కోటేశ్వర రావు, బిక్షపతి, శ్రీనివాస్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# అధికార, ప్రతిపక్షాలకు ప్రజల సమస్యలపై పట్టింపు లేదు..

- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

బలగం టీవీ, వరంగల్

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నర్సంపేట మండలంలోని మాదన్నపేట చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె చెరువు పరిస్థితులను పరిశీలించారు. అనంతరం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ.. ఇక్కడ వందలాది ఎకరాలకు నీళ్లిచ్చే ఈ చెరువు వద్ద ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లబెల్లి రోడ్డులో కట్టిన లో లెవల్ మత్తడి వద్ద చెరువు ఓవర్ ఫ్లో అవుతోందని, దాని ఎత్తు పెంచాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. చెరువు వద్ద మత్తడిపై ఉన్న కాజ్ వే ఎత్తును కూడా పెంచాలని ప్రజలు కోరుతున్నారని, అలా చేస్తే రైతులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు.

తాజా, మాజీ ఎమ్మెల్యేలు ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బిజీగా ఉన్నారని, ఇక్కడి సమస్యలను పట్టించుకోవడం లేదని కవిత విమర్శించారు. "ఏ పార్టీలు ఎక్కడ ఉన్నా సరే, జాగృతి మాత్రం ప్రజల్లో ఉంటుంది" అని ఆమె స్పష్టం చేశారు. ఇక్కడి కాజ్ వే, బ్రిడ్జి, రోడ్డు పనులు గతంలోనే సాంక్షన్ అయ్యాయని, కానీ ఎందుకు కట్టలేదో నర్సంపేట ప్రజలందరికీ తెలుసన్నారు. ఈ పనులు పూర్తి చేయటానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని, నర్సంపేట అభివృద్ధికి సంబంధించి జాగృతి కార్యాచరణ తీసుకుంటుందని ఆమె ప్రకటించారు.



తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పత్తి, వరి సహా ఇతర పంటలకు తీవ్ర నష్టం జరిగిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేవలం ఒక్క రోజు సమీక్ష చేసి రెండు జిల్లాల రైతులకే నష్టపరిహారం ఇస్తామనడం సరికాదన్నారు. పత్తి రైతులకు తేమ శాతం మీద కండిషన్స్ పెడుతున్నారని, ఇది దారుణమని అన్నారు.

ముఖ్యమంత్రి పొద్దున లేస్తే జూబ్లీహిల్స్ ఎన్నికలపై బిజీగా ఉంటున్నారు. కానీ ఇక్కడ రైతులు చాలా నష్టపోతున్నారని కవిత తీవ్రంగా విమర్శించారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చినా తెలంగాణకు రూపాయి రాలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఏ పని చేయలేదని ఆమె ఎత్తి చూపారు. అధికారంలో ఉన్నవారు పనిచేయడం లేదు, ప్రతిపక్షం కూడా పనిచేయడం లేదు, ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి ప్రజల సమస్యల మీద పట్టింపు లేకుండా పోయిందని అందుకే ప్రజల సమస్యల పరిష్కారం కోసం జాగృతి 'జనం బాట' పట్టింది అని కవిత పేర్కొన్నారు.

# ఎల్బాకలో ఉచిత వైద్య శిబిరానికి స్పందన




బలగం టీవీ, హైదరాబాద్

వీణవంక మండలంలోని ఎల్బాక గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ ఊట్ల దేవయ్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. లయన్స్ క్లబ్ కరీంనగర్, గోల్డెన్ శాతవాహన, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ సిటీ స్కాన్ డయాగ్నస్టిక్ కరీంనగర్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 150 మంది స్థానికులకు డయాబెటీస్, రక్తపోటు తదితర పరీక్షలు ఉచితంగా చేయడం జరిగింది.

ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మితాహారం తీసుకోవాలి, ఆకుకూరలు%-%కూరగాయలతో కూడిన ఆహారం అలవాటు చేసుకోవాలి, మద్యాన్ని దూరం పెట్టాలి, ప్రతిరోజూ యోగా వ్యాయామాన్ని జీవితంలో భాగం చేసుకోవాలి అని సూచించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తక్కువ ధరలో ఆరోగ్య పరీక్షలు అందుబాటులో ఉంటాయని వారు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎన్. గిరిధర్‌రావు, కార్యదర్శి నర్సింహరెడ్డి, కోఆర్డినేటర్ ఎం. శంకర్, ఉపాధ్యక్షుడు రాములు, డైరెక్టర్లు గంగాధర్, వెంకటస్వామి, డయాగ్నస్టిక్ సెంటర్ ప్రతినిధులు వినయ్, రవి, జిల్లా మాజీ రైతుబంధు సభ్యులు ముత్యాల శంకర్‌యాదవ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎం. భూమయ్య, మాజీ ఉపసర్పంచ్ రాజారాం, మాజీ సర్పంచ్ మాడ మధుసూదన్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు కొయ్యడ జాన్, కాశిపాక లూక తదితరులు పాల్గొన్నారు.

# ఓటమి భయంతో బీజేపీపై నిందలు వేస్తున్నారు: డా. లక్ష్మణ్

బలగం టీవీ, హైదరాబాద్




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఒత్తిడికి లోనై, బీజేపీపై ఆధారంలేని ఆరోపణలు చేస్తూ అసత్య ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్ విమర్శించారు. రేవంత్ మాటల్లో ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన డా. లక్ష్మణ్.. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీజేపీపై నిందలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటికో ఉద్యోగం అంటూ బీహార్‌లో ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ ఇచ్చిన హామీ అమలు సాధ్యమా? ఏడు కోట్ల జనాభా ఉన్న రాష్ట్రంలో అలాంటి హామీ ఎలా అమలు చేస్తారని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా ప్రజలకు ఏ బహుమతి ఇవ్వబోతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి అధికారాన్ని పంచుకున్నాయని ఆరోపిస్తూ "20 శాతం ఓట్ల కోసం దిగజారి మాట్లాడితే, 80 శాతం ఉన్న ప్రజలు బుద్ధి చెబుతారు" అని హెచ్చరించారు. పాతబస్తీలో మజ్లిస్‌కు అవకాశం ఇచ్చి "పాముకు పాలు పోసి పెంచినట్లయ్యింది, ఇప్పుడు విషనాగులా మారింది" అని విమర్శించారు.

# పెండ్లి వేడుకలో విషాదం

- **బారాత్‌లో డ్యాన్స్ చేస్తూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చోలేటి కిషన్ రెడ్డి కన్నుమూత**



బలగం టీవీ, హుజురాబాద్

హుజురాబాద్ మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన ఎల్ఎండీ ప్రాజెక్టు మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చోలేటి కిషన్ రెడ్డి (55) శుక్రవారం రాత్రి ఆకస్మిక గుండెపోటుతో మృతి చెందారు. పెళ్లి వేడుకలో పాల్గొన్న ఆయన బారాత్‌లో డ్యాన్స్ చేస్తుండగానే కుప్పకూలిపోవడంతో గ్రామమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం కిషన్ రెడ్డి సమీప బంధువు రఘోత్తమ రెడ్డి కుమార్తె వివాహం హన్మకొండలో జరిగింది. అనంతరం పోతిరెడ్డిపేటలో బారాత్ నిర్వహించగా, అందులో ఆయన ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. వెంటనే గ్రామస్తులు హుటాహుటిన హుజురాబాద్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో మృతదేహాన్ని తిరిగి గ్రామానికి తరలించగా, గ్రామమంతా శోకసంద్రంగా మారింది. సుదీర్ఘకాలంగా బీఆర్ఎస్ పార్టీలో సేవలందించిన ఆయన ఎల్ఎండీ ప్రాజెక్టు చైర్మన్‌గా కూడా పనిచేశారు. గతంలో కిషన్ రెడ్డికి గుండె సంబంధిత చికిత్స జరిగినట్లు తెలియడం జరిగింది. అయితే బారాత్ సందర్భంగా గట్టి డీజే సౌండ్ కారణంగానే గుండెపోటు సంభవించి ఉండొచ్చని గ్రామస్తులు చెబుతున్నారు. కిషన్ రెడ్డి ఆకస్మిక మరణంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర విషాదాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.




# అక్రమంగా ఫ్లెక్సీ తొలగించారని పీఎస్‌లో బీఆర్ఎస్ ఫిర్యాదు

బలగం టీవీ, బోయినిపల్లి:

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు తొలగించినందున పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన బోయినిపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు.దీపావళి సందర్బంగా బిఆర్ఎస్ పార్టీ తరుపున శుభాకాంక్షలు తెలుపుటకు కొదురుపాక గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అట్టి బిఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీని తొలగించారు. ఇట్టి విషయాన్ని గ్రామ పంచాయతీ సిబ్బందిని అడగగా మేము తీసివేయలేదని తెలిపారు. అందుకు గాను ఈరోజు శుక్రవారం రోజున బిఆర్ఎస్ పార్టీ నాయకులు బోయినపల్లి మండల పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వెంటనే తొలగించిన వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంక్వైరీ చేసి తగు చర్యలు చేపడుతామని ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్ మాజీ సర్పంచ్ అక్కెనపల్లి అక్కెనపల్లి కర్ణాకర్, సోషల్ మీడియా కన్వీనర్ బత్తిని కమల్ గౌడ్, మాజీ డైరెక్టర్ కన్నం సాగర్, నల్ల సతీష్, జగన్ గౌడ్, మేకల మహేష్, దూస మధు తదితరులు ఉన్నారు.



# బహుమతులు అందజేత..

బలగం టీవీ, బోయినిపల్లి

టి-సాట్ వారు నిర్వహించిన అన్వేల్ స్టూడెంట్ కాంపిటీషన్-2025 లో మండల స్థాయిలో ఈజీ రైటింగ్ వర్షశీకి మొదటి బహుమతి రాగా, స్పీచ్ శ్రీవర్షకి రెండవ బహుమతి, క్విజ్ లో మొదటి బహుమతులను గెలుచుకున్నారు. కొదురుపాక హై స్కూల్ హెడ్మాస్టర్ అందించారు.

# ప్రయివేటు బస్సుపై దాడి, ధ్వంసం..

బలగం టీవీ, హైదరాబాద్:



గంజాయి మత్తులో ఉన్న యువకుల ఆగడాలు హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ మితిమీరుతున్నాయి. ముఖ్యంగా నగర శివారు ప్రాంతాల్లో ఈ గంజాయి బ్యాచ్‌లు పేట్రేగిపోతూ భయాందోళనలు సృష్టిస్తున్నాయి. తాజా ఘటనలో చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపేట మెట్రో పిల్లర్ నెం. 1629 వద్ద గంజాయి మత్తులో ఉన్న కొందరు యువకులు దారుణానికి పాల్పడ్డారు. పటాన్ చెరు నుండి ఆంధ్రప్రదేశ్ వెళ్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు తమ కారు తగిలిందనే చిన్న కారణంతో యువకులు రెచ్చిపోయారు. గంజాయి మత్తులో ఉన్నట్టుగా తెలుస్తున్న యువకులు బస్సు డ్రైవర్‌పై మొదటగా దాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత బస్సును దారుణంగా ధ్వంసం చేశారు. ఈ ఆకస్మిక దాడితో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బస్సు డ్రైవర్ అందించిన ఫిర్యాదు మేరకు చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రంజీ పోరులో హైదరాబాద్ ఆధిక్యం

**బలగం టీవీ, హైదరాబాద్**



రాజస్థాన్‌తో ప్రారంభమైన రంజీ ట్రోఫీ గ్రూప్–డీ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి రోజు ముగిసే సరికి మెరుగైన స్థితిలో నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ 7 వికెట్లకు 295 పరుగులు చేసింది. ఓపెనర్లు తన్మయ్ అగర్వాల్ (6), అభిరాత్ రెడ్డి (9) విఫలమైనప్పటికీ, రాహుల్ రాధేశ్ (85 నాటౌట్), కెప్టెన్ రాహుల్ సింగ్ (55) అర్ధశతకాలతో ఇన్నింగ్స్ నిలబెట్టారు. 8 ఫోర్లు కూడిన రాధేశ్ దూకుడు రాజస్థాన్ బౌలర్లను క్రమేపీ నెగ్గించాడు. చివర్లో త్యాగరాజన్ (5 నాటౌట్) రాధేశ్‌కు తోడుగా డే%–%1 ముగిసే వరకు క్రీజులో నిలిచాడు. రాజస్థాన్ తరఫున అనికేత్ (2/35), అశోక్ (2/61) చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

# టీ20 సిరీస్ భారత్‌దే..!

- **గబ్బాలో వర్షంతో**

**ఐదో టీ20 రద్దు**

**బలగం టీవీ, హైదరాబాద్**

బ్రిస్బేన్‌లోని గబ్బా వేదికగా భారత్, ఆస్ట్రేలియా మధ్య జరగాల్సిన ఐదు టీ20ల సిరీస్‌లో ఆఖరి మ్యాచ్ (ఐదవ టీ20) వర్షం కారణంగా రద్దైంది.

టాస్ గెలిచిన ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ ముందుగా బౌలింగ్ ఎంచుకోగా, భారత్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ దూకుడుగా ఆడారు. కేవలం 4.5 ఓవర్లలోనే టీమిండియా వికెట్ నష్టపోకుండా 52 పరుగులు చేసింది. గిల్ (29ి), అభిషేక్ శర్మ (23ి) క్రీజులో ఉండగా, ఉరుములు,




మెరుపులతో కూడిన భారీ వర్షం రావడంతో అంపైర్లు మ్యాచ్‌ను నిలిపివేశారు. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ ఇప్పటికే 2–1 తేడాతో తిరుగులేని ఆధిక్యంలో ఉంది. చివరి మ్యాచ్ రద్దు కావడంతో, ఈ సిరీస్‌ను టీమిండియా 2–1తో కైవసం చేసుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై మరో టీ20 సిరీస్‌ను గెలిచి భారత్ తన రికార్డును కొనసాగించింది.



# హాంగ్‌కాంగ్ సిక్సెస్‌లో టీమిండియా శుభారంభం

**బలగం టీవీ, హైదరాబాద్**

హాంగ్‌కాంగ్ సిక్సెస్ టోర్నీలో భారత జట్టు విజయపథంలో నడిచింది. శుక్రవారం పాకిస్థాన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో దినేశ్ కార్తీక్ నాయకత్వంలోని భారత్ డక్‌వర్త్–లూయిస్ పద్ధతిలో రెండు పరుగుల తేడాతో గెలుపొందింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఆరు ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. రాబిన్ ఊతప్ప 11 బంతుల్లో 28, చిప్లీ 13 బంతుల్లో 24, దినేశ్ కార్తీక్ 6 బంతుల్లో 17 నాటౌట్ చేసి స్కోరు బోర్డును సమృద్ధిగా తీర్చిదిద్దారు. పాకిస్థాన్ బౌలర్లలో ముహమ్మద్ షెహ్‌జాద్ రెండు వికెట్లు, అబ్దుల్ సమద్ ఒక వికెట్ తీశారు.

లక్ష్యఛేదనకు దిగిన పాకిస్థాన్ వర్షం కారణంగా మ్యాచ్ నిలిచే సమయానికి మూడు ఓవర్లలో వికెట్ నష్టానికి 41 పరుగులు చేసింది. ఖవాజా నఫే 18 నాటౌట్, అబ్దుల్ సమద్ 16 నాటౌట్ చేసి పోరాడినా, భారత బౌలర్ స్టువర్ట్ బిన్నీ కీలక వికెట్ తీసాడు. వర్షం ఆగకపోవడంతో అంపైర్లు డీఎల్ఎస్ ప్రకారం ఫలితాన్ని ప్రకటించగా, పాకిస్థాన్ రెండు పరుగుల వెనుకబడ్డట్లు తేలింది. భారత్ తన తదుపరి మ్యాచ్‌ను శనివారం కువైట్‌తో ఆడనుంది.

విభిన్న ఫార్మాట్‌తో ప్రసిద్ధి చెందిన ఈ టోర్నీలో ఒక్కో జట్టులో ఆరుగురు ఆటగాళ్లు మాత్రమే ఉంటారు. ఆరు ఓవర్ల ఇన్నింగ్స్‌లో ప్రతి ఫీల్డర్ తప్పనిసరిగా ఓ ఓవర్ వేయాలి. బ్యాటర్ 31 పరుగులు సాధిస్తే రిటైర్డ్ నాటౌట్‌గా వెనుదిరగాలి. ఐదు వికెట్లు పడిపోయినా చివరి బ్యాటర్‌కు రనౌట్ మినహా ఔట్ కాదనే ప్రత్యేక నిబంధన అమలులో ఉంటుంది. వైడ్, నోబాల్‌కు రెండు పరుగులు ఇస్తారు. ఈ టోర్నీలో 12 జట్లు నాలుగు గ్రూపుల్లో రౌండ్ రాబిన్ పద్ధతిలో పోటీపడుతున్నాయి. ప్రతి గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉన్న జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. అనంతరం సెమీఫైనల్స్, ఫైనల్ ద్వారా టైటిల్ నిర్ణయించబడుతుంది. ప్రత్యేక ఫార్మాట్ కారణంగా ఈ టోర్నీ అభిమానులను బాగా ఆకర్షిస్తోంది.

# 'ది గర్ల్‌ఫ్రెండ్'లో దుర్గ పాత్ర నా మనసులో శాశ్వతం

- **అను ఇమ్మాన్యుయేల్**

**బలగం టీవీ, హైదరాబాద్**



రష్మిక మందన్న ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'ది గర్ల్‌ఫ్రెండ్'లి చిత్రంలో దుర్గ పాత్రలో నటించిన నటి లిలిఅను ఇమ్మాన్యుయేల్ ఈ పాత్ర తన హృదయంలో ఎప్పటికీ ప్రత్యేకంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. సినిమా విడుదల సందర్భంగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగపూరితంగా స్పందించారు. "లిదుర్గ పాత్ర నిడివి చిన్నదైనా నాకందించిన సంతృప్తి చాలా పెద్దది. మాటలకన్నా మౌనం ద్వారా మాట్లాడే బలమైన భావోద్వేగం ఆ పాత్రలో ఉంది. దుర్గగా నటించడం నాకు ఒక కొత్త అనుభూతిని ఇచ్చిందిలి" అని అను తెలిపారు.దర్శకుడు రాహుల్ రవీంద్రన్‌పై ఆమె ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. "మహిళల పాత్రలను ఇంత నిజాయతీగా రాసినందుకు ధన్యవాదాలు. ప్రతి సన్నివేశం వద్ద మీరు నన్ను నడిపించిన తీరు ఎంతో అద్భుతం " అని అభినందించారు.కథానాయిక రష్మిక మందన్నను కూడా అను అభినందించారు. "లినీ ఆప్యాయత, నిజాయతీ సెట్‌పై ప్రతి క్షణాన్ని ప్రత్యేకంగా మార్చాయి. నువ్వు ఎల్లప్పుడూ ఉత్తమమైనదే పొందాలిలి" అని చెప్పారు. హీరో దీక్షిత్ శెట్టితో పాటు ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.సినిమాటోగ్రాఫర్ లిలికృష్ణన్ వసంత్‌లిలిపై ప్రత్యేకంగా స్పందించిన అను, "నేను ఎప్పుడూ ఇంత అందంగా కనిపించలేదు. క్లైమాక్స్‌ను మీరు చిత్రీకరించిన తీరు అద్భుతంలి" అని పేర్కొన్నారు. ప్రేక్షకుల ఆదరణకు కృతజ్ఞతలు తెలుపుతూ, " దుర్గ పాత్రకు మీరు అందించిన ప్రేమ మనం ఎందుకు ఈ పని చేస్తామో మళ్లీ గుర్తు చేసింది. తెరపై చిన్నగా కనిపించే కొన్ని పాత్రలు హృదయాల్లో పెద్ద ముద్ర వేస్తాయిలి" అని అను ఇమ్మాన్యుయేల్ అన్నారు.

# నేటితో ప్రచారానికి తెర

(మొదటి పేజీ తరువాయి)

నామినేషన్లను పరిశీలన చేశారు. నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబర్ 24న చివరి తేది వరకు అవకాశం కల్పించారు. నవంబర్ 11న పోలింగ్ నిర్వహించనున్నారు. ఉప ఎన్నికలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల(ఈవీఎంలు), వీవీ ప్యాట్(వీవీపీఏటీ) యంత్రాలను వినియోగిస్తున్నారు. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి చేస్తారు. 16తో ఎన్నికల ప్రక్రియపూర్తవుతుంది.

జూబ్లీహిల్స్ అనగానే అందరికీ గుర్తుకొచ్చేది సంపన్నులుండే ప్రాంతం. కానీ, ఈ నియోకవర్గంలో జనాభలో అధికంగా ఉన్నది పేద, మధ్యతరగతి వర్గాలే. అయితే ఈ నియోజకవర్గం ఓటర్ల ఆదరణ ఎవరికి ఉండనుందో చర్చనీయాంశమైంది. ఈ నియోజకవర్గంలో ఏడు డివిజన్లు షేక్‌పేట్, ఎర్రగడ్డ, బోరబండ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, యూసుఫ్‌గూడా, సోమాజీగూడ ఉన్నాయి. అన్ని డివిజన్లలోనూ భిన్న వర్గాల ఓటర్లున్నారు. ఒక్కో డివిజన్‌లో ఒక్కోపార్టీకి ఆదరణ లభిస్తుంది. షేక్‌పేట డివిజన్‌లో దాదాపు 55వేల మంది ఓటర్లున్నారు. ఈ డివిజన్‌లో మైనార్టీలు అధికంగా ఉన్నారు. దిగువ మధ్యతరగతి వర్గాల వారున్నారు. బోరబండలో మైనార్టీలు, పేదలు, దిగువ మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉన్నారు. ఇక్కడ 62వేలకుపైగా ఓటర్లున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అతిపెద్దడివిజన్ రహ్మత్‌నగర్‌లో సుమారు 65వేల మంది ఓటర్లుండగా 60శాతం మంది మైనార్టీలున్నారు. ఇక్కడ బస్తీలు అధికంగా ఉంటాయి. ఎస్పీఆర్ హిల్స్‌లో సుమారు 23వేల మంది ఓటర్లుండగా, కార్మికనగర్‌లో 21వేల మంది ఓటర్లున్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో బస్తీలతోపాటు, కొన్ని కాలనీలున్నాయి. ఇక్కడ అపార్టుమెంట్స్ కల్చర్ అధికంగా ఉంటుంది. కేవలం అపార్టుమెంట్‌లలో సుమారు 12వేలకుపైగా ఓటర్లున్నారు. వీరంతా సైలెంట్ ఓటర్లు. ఇక వెంగళరావు నగర్‌ది ప్రత్యేక గుర్తింపు ఉంది. వెంగళరావు నగర్‌లో కాలనీలు, బస్తీలో కీలకం. విద్యావంతులు అధికంగా ఉంటారు. యూసుఫ్‌గుడా డివిజన్‌లో సీనీ పరిశ్రమకు చెందివారు అధికంగా నివాసముంటారు. మధురానగర్‌తోపాటు కృష్ణానగర్, వెంకటగిరి, యాదగిరినగర్ బస్తీల సమాహారంగా యూసుఫ్‌గూడా డివిజన్ ఉంటుంది. సుమారు 43వేల మంది ఓటర్లున్నారు. మొత్తం నియోజకవర్గంలో 3,92,669 మంది ఓటర్లున్నారు. బస్తీలు, కాలనీలు, మైనారిటీలు, బీసీ, ముదిరాజ్‌లు భిన్న వర్గాలున్నా ఈ నియోజకవర్గంలో ఓటర్లు ఉప ఎన్నికల్లో ఎవరివైపు మొగ్గుచూపుతారో చూడాల్సి ఉంది.

**నేటి నుంచి ఆంక్షలు అమలు : సీపీ**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ నేపథ్యంలో హైదరాబాద్ సీపీ సీవీ సజ్జనర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం 9వతేదీ సాయంత్రం 6 గంటల తరువాత ప్రచారాన్ని ముగించాలని, జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో 144 సెక్షన్ కొనసాగుతుందని తెలిపారు. ఆదివారం సాయంత్రం 6గంటల నుంచి పోలింగ్ జరగనున్న 11వతేదీ (మంగళవారం) సాయంత్రం 6గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. తిరిగి ఓట్ల లెక్కింపు జరిగే 14న ఉదయం 6గంటల నుంచి 15వ తేదీ సాయంత్రం 6గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. నిర్దేశించిన సమయాల్లో మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారంట్లు, క్లబ్బులు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్ రోజున రహదారులు, జనావాసాల్లో బాణసంచా కాల్చడాన్ని నిషేధమన్నారు. 200మీటర్ల పరిధిలో ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది గుమిగూడవద్దన్నారు. ఆదేశాలను ఉల్లఘిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. రేవంత్ ప్రభుత్వం ఫేక్, ఫ్రాడ్, ఫాల్స్–ఫెయిల్యూర్ గవర్నమెంట్ అని కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణకు రేవంత్ శాపమని, తెర వెనుక రాజకీయాల్లో ఆయన దిట్ట అని ఆరోపించారు.

# 'చికిరి చికిరి' పాటకు రికార్డు వ్యూస్

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న తాజా చిత్రం 'పెద్ది' నుంచి విడుదలైన తొలి పాట 'చికిరి చికిరి' భారత సినీ చరిత్రలో సంచలన రికార్డు సృష్టించింది. ఈ పాట అత్యంత వేగంగా 32 మిలియన్ల వ్యూస్ సాధించి, ఇండియన్ సినిమాల్లో విడుదలైన పాటల్లోనే అతి తక్కువ సమయంలో అత్యధిక వ్యూస్ పొందిన పాటగా నిలిచింది. అన్ని భాషల్లో కలిపి ఈ పాట వ్యూస్ 46 మిలియన్ల మార్క్ దాటగా, చిత్రబృందం అధికారికంగా ప్రకటించడంతో మెగా అభిమానులు సంబరాలు చేస్తున్నారు.'ఉప్పెన' దర్శకుడు బుచ్చిబాబు సానా రూపొందిస్తున్న ఈ చిత్రంపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. సంగీత మాంత్రికుడు ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి స్వరాలందించడం వల్ల సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. రామ్ చరణ్%–%బుచ్చిబాబు%–రెహమాన్ కాంబినేషన్ నుంచి వచ్చిన తొలి పాటకే ఇంతటి స్పందన రావడం విశేషం. పాటలోని విజువల్స్, రామ్ చరణ్ ఎనర్జిటిక్ స్టెప్స్ ప్రేక్షకుల్లో హుటాహుటిన ట్రెండ్ అయ్యాయి.

మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రామ్ చరణ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా,




కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సినిమాటోగ్రఫీకి రత్నవేలు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ప్రస్తుతం 'చికిరి చికిరి' పాట యూట్యూబ్‌తో పాటు వివిధ మ్యూజిక్ ప్లాట్‌ఫార్మ్‌లలో టాప్ ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. ఈ పాట సృష్టించిన ప్రభంజనంతో 'పెద్ది' పై అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ చిత్రాన్ని 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇప్పటికే తెలిపారు.